AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

2-1-2026 (Friday) | MAIN EDITION

## హైదరాబాద్‌ను కమ్మేసిన పొగమంచు.. పలు విమానాల రద్దు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా చలితీవ్రత తగ్గింది. అయితే పొగమంచు కమ్మేసింది. ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు మంచు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ నగరంతో పాటు మిగతా ప్రాంతాల్లో సైతం శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. నాలుగు మీటర్ల దూరంలో ఉన్నవి కూడా కనిపించలేనంతంగా మంచు కమ్మేసింది. విజిబిలిటీ తక్కువగా ఉండడంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్‌లో పొగమంచు కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది.

## గాలి జనార్దన్ రెడ్డిపై హత్యాయత్నం..



**అక్షరటుడే, కర్ణాటక:** బళ్లారిలో మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఎమ్మెల్యే భరత్ రెడ్డి అనుచరుడు ఆయనపై కాల్పులు జరిపినట్లు సమాచారం. మొత్తం 8 రౌండ్ల వరకు కాల్పులు జరగగా ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. అయితే గాలి జనార్దన్ రెడ్డి మాత్రం ఈ కాల్పుల నుంచి తప్పించుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఎదురుకాల్పుల్లో సతీష్ రెడ్డి అనే వ్యక్తికి బుల్లెట్ గాయమైనట్లు తెలుస్తోంది. జనార్దన్ రెడ్డి ఇంటి ప్రహరీకి ఫ్లెక్సీ కట్టడంపై తలెత్తిన వివాదమే ఈ హింసాత్మక ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## రేపు కొండగట్టుకు పవన్ కళ్యాణ్



**అక్షరటుడే, హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం తెలంగాణకు రానున్నారు. కొండగట్టులో 96 గదుల సత్రాల నిర్మాణ స్థలానికి పవన్ శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పవన్ పర్యటన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.**

## భారీగా పెరిగిన బంగారం ధరలు



**అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,140 పెరిగి రూ.1,36,200 చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రూ.1,050 పెరిగి రూ.1,24,850 పలుకుతోంది. అటు కేజీ వెండి ధర రూ.4,000 పెరిగి రూ.2,60,000గా ఉంది.**

## ఏపీకి రానున్న కాంగ్రెస్ అగ్రనేతలు



**అక్షరటుడే, ఏపీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఫిబ్రవరి 2న ఏపీకి రానున్నారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని బండ్లపల్లి వెళ్లనున్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం రద్దుకు వ్యతిరేకంగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి బండ్లపల్లిలో నిరసన తెలపనున్నారు.**

**మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా.. మూసీ పునరుజ్జీవంపై చర్చను స్పీకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఫస్ట్ ఫేజ్‌లో గండిపేట నుంచి బాపుఘాట్ వరకు 21 కి.మీ. మేర మూసీ నదిని అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని తెలిపారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



## మూసీ ప్రక్షాళన

# చేసి తీరుతాం

■ మొదటి దశలో 21 కి.మీ. మేర అభివృద్ధి ■ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ■ వాడీవేడిగా సమావేశాలు ■ బీఆర్‌ఎస్ సభ్యుల ఆందోళన

మూసీ సుందరీకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడీబీ బ్యాంక్‌రూ.4,100 కోట్ల రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. నాలుగైదు రోజుల్లో అన్ని వివరాలు బయటకు చెబుతామన్నారు. యూపీలో గంగా ప్రక్షాళన చేశారని, ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన చేస్తామని చెప్పారని సీఎం గుర్తు చేశారు. మూసీని కలుషితం చేయడంతో నల్గొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నుంచి 20 టీఎంసీలు ఈ నదిలోకి తరలిస్తామన్నారు. మార్చిలో మూసీ ఫస్ట్ ఫేజ్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

### డీపీఆర్‌పై త్వరలో క్లారిటీ

బాపూఘాట్ దగ్గర మూసీ, ఈసా నదులు కలుస్తాయని సీఎం చెప్పారు. మూసీ అభివృద్ధికి అనేక సమీక్ష సమావేశాలు నిర్వహించామన్నారు. మూసీ ప్రక్షాళన డీపీఆర్‌పై సంక్రాంతిలోగా క్లారిటీ వస్తుందని తెలిపారు. కొందరు జలవనరులను ఆగం చేసి ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని విమర్శించారు. మూసీ అభివృద్ధిపై అధ్యయనం కోసం అనేక దేశాల్లో పర్యటించినట్లు తెలిపారు. మూసీ ప్రక్షాళన సమయంలో నష్టపోయే నిర్వాసితులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### వరదలతో ప్రజల ఇబ్బంది

హైదరాబాద్‌లో ఇటీవల వరదలు వచ్చినప్పుడు గండిపేట, హిమాయత్ సాగర్ గేట్లు ఉద్దేశపూర్వకంగా ఒకేసారి తెరిచారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దీంతో ఇళ్లు మునిగిపోయి, ఎంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పైనుంచి వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకొని కొద్దికొద్దిగా నీటిని కిందికి వదలాలని అన్నారు. కానీ అవేమీ పట్టించుకోకుండా ప్రాజెక్ట్ నిండే వరకు గేట్లు తెరవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కావాలనే ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ పెద్దలు చేశారని ఆరోపించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో నాలాలు సరి చేయకుండా మూసీ సుందరీకరణ చేసినా ఉపయోగం ఉండదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. డ్రెయినేజీ నీళ్లు మూసీలో కలుస్తున్నప్పుడు, వాటిని అరికట్టకుండా లక్షల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తే లాభం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సీఎం స్పీచ్ అనంతరం తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ సభ్యులు కోరగా.. స్పీకర్ అనుమతి ఇవ్వకపోవడంతో వారు వాకౌట్ చేశారు.

### యూరియాపై బీఆర్‌ఎస్ నిరసన

సభ ప్రారంభం కాగానే బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. యూరియాపై చర్చించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతపై వాయిదా తీర్మానం ఇచ్చారు. అయితే దానిపై చర్చకు స్పీకర్ అంగీకరించలేదు. దీంతో బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు.




## కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే.. బీఆర్‌ఎస్ పనిఖతం : కవిత

**అక్షరటుడే, హైదరాబాద్** : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే బీఆర్‌ఎస్ పని ఖతమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావడం లేదు. అప్పుడప్పుడు వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నారు. కానీ చర్చల్లో పాల్గొనలేదు. ఇటీవల సైతం మూడు నిమిషాలే సభలో ఉన్నారు. దీనిపై తాజాగా కవిత మీడియా చిట్ చాట్‌లో మాట్లాడారు. అసెంబ్లీకి కేసీఆర్ రాకపోతే బీఆర్‌ఎస్ పని ఖతమన్నారు. కేసీఆర్‌ను కసబ్‌తో పోల్చడాన్ని ఆమె తప్పు పట్టారు. ఉద్యమ నాయకుడిపై మాట్లాడే ముందు రేవంత్ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని హితవు పలికారు.

## నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. పైప్‌లైన్ మరమ్మతుల నేపథ్యంలో 19 గంటల పాటు నీటి సరఫరా ఉండదని జలమండలి అధికారులు తెలిపారు. నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకంలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. బొమ్మకల్ పంపింగ్ స్టేషన్ సమీపంలోని శ్రీనివాస్ నగర్ బ్రిడ్జి వద్ద 3000 మి.మీ. డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కి లీక్ అవుతోంది. దీనికి అధికారులు మరమ్మతులు చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతులు కొనసాగనున్నాయి. దీంతో ఈ 19 గంటలు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కేసు



**అక్షరటుడే, హైదరాబాద్:** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదైంది. దుర్గం చెరువు ఆక్రమించారని ఆయనపై హైడ్రా ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల దుర్గం చెరువు ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. డిసెంబర్ 30న హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి చెరువును ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నేత కొత్త ప్రభాకర్ రెడ్డి దుర్గం చెరువులో మట్టి, రాళ్లు నింపి అక్రమంగా ప్రైవేటు పార్కింగ్ దందా చేశారని హైడ్రా పేర్కొంది. 2014 నుంచి దుర్గం చెరువును కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అబద్ధాల పోటీలు పెడితే.. ఆ పార్టీలకు అవార్డులు : బండి



**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణ జలాల విషయంలో తెలంగాణకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణ జలాలు, పాలమూరు-రంగారెడ్డిపై ఇటీవల కేసీఆర్ మాట్లాడిన విషయం తెలిసిందే. దానికి స్పందన గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు నిజాలు పేరిట పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ క్రమంలో బండి సంజయ్ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తీరుపై విమర్శలు చేశారు. రెండు పార్టీలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై బురదజల్లుతున్నాయని ఆరోపించారు. అబద్ధాల పోటీలు నిర్వహిస్తే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు అవార్డులు రావడం ఖాయమని చెప్పారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా..



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా చాబోలు జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. నెల్లూరు నుంచి కర్నూలు వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగులు ప్రయాణికులు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డుపై పడిపోయిన బస్సును పక్కకు తొలగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వంతెన ప్రారంభించిన మంత్రి పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని అశోక్ నగర్‌లో రూ.ఆరు కోట్లతో నిర్మించిన వంతెను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. దీంతో ప్రజలకు దూరభారం తగ్గనుంది. నగరంలో కనెక్టివిటీని బలోపేతం చేసేలా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అశోక్ నగర్ సమీపంలో వంతెన నిర్మించారు. హుస్సేన్ సాగర్ మిగులు నాలాపై రూ.ఆరు కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశారు. దీంతో సిటీ సెంట్రల్ లైబ్రరీ, అశోక్ నగర్ ఏవీ కాలేజ్, గగన్‌మహల్ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుదంఇ. 48.2 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు బ్రిడ్జి కట్టారు.

## వాడే నిజమైన రాక్షసుడు: పూనమ్‌కౌర్



**టాలీవుడ్ హీరోయిన్ పూనమ్ కౌర్ కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. మన నమ్మకం, కుటుంబం, భవిష్యత్తు నుంచి మనల్ని వేరు చేసేవాడే నిజమైన రాక్షసుడు అని ఆమె అన్నారు. ఒకప్పుడు హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న పూనమ్ కొంతకాలంగా వెండితెరకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. సినిమాల్లో కనిపించకపోయినా, వివాదాస్పద వ్యాఖ్యలు, ఇంటర్వ్యూల ద్వారా ఆమె తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూనమ్ కౌర్, తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణం, ఎదుర్కొన్న కఠిన అనుభవాలపై ఓపెన్‌గా మాట్లాడారు. తన కెరీర్ ప్రారంభంలోనే అల్లు అర్జున్ సినిమా అవకాశం వచ్చినా, దర్శకుడు తేజకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఆ అవకాశాన్ని వదులుకున్నానని పూనమ్ వెల్లడించారు.** - అక్షరటుడే, సినిమాడెస్క్

## ట్రంప్ ఆరోగ్యంపై మరోసారి చర్చ..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం మరోసారి రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చకు దారి తీసింది. ప్రస్తుతం 79 ఏళ్ల వయసులో అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవలి కాలంలో ట్రంప్ చేతులపై నీలిరంగు గాయాల మచ్చలు కనిపించడంతో ఆయన ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్వయంగా స్పందించారు. ది వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తన ఆరోగ్యం గురించి స్పష్టత ఇచ్చారు. "నేను పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను. నా ఆరోగ్యంపై పదే పదే ప్రశ్నలు వేయడం విసుగుగా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. చేతులపై కనిపించిన మచ్చలు ఆరోగ్య సమస్యల వల్ల కాదని, తాను ప్రతిరోజూ రక్తాన్ని పలుచన చేయడానికి తీసుకునే ఆస్పిరిన్ కారణంగా వచ్చాయని తెలిపారు. "రక్తం గట్టిగా ఉండడం నాకు ఇష్టం లేదు. గుండె నుంచి సన్నని రక్తం ప్రవహించాలి కదా" అంటూ ఆస్పిరిన్ వాడకం గురించి ట్రంప్ వివరించారు.

## ఈవీఎంలకే జై కొట్టిన కర్ణాటక ప్రజలు

**అక్షరటుడే, బెంగళూరు:** ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. కర్ణాటకలో చేపట్టిన ఓ సర్వే చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఈవీఎంలను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు గుప్పించింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ (కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ) గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక దేశ వ్యాప్తంగా ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం ప్రజలు విశ్వసించినట్లు నివేదిక తెలిపింది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు.